ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ఆవులకుప్పానికి కొత్త అతిథి

రామకుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆవులకుప్పం గ్రామంలో ఓ నెమలి సందడి చేస్తోంది. వారం రోజులుగా గ్రామ వీధుల్లో సంచరిస్తోంది. రాత్రి సమీప అడవిలోకి వెళ్ళి తెల్లారిన తర్వాత గ్రామ వీధుల్లో ప్రత్యక్షమౌతోంది. గ్రామస్థులు కూడా ఆతిథ్యం ఇస్తూ ఆదరిస్తున్నారు. చిన్నారులు నెమలి హొయలను చూస్తూ సంబరపడిపోతున్నారు.



ఫ్రీ హోల్డ్ భూముల

రిజిస్ట్రేషన్లకు మోక్షం..?

- అక్రమ ఫ్రీ హోల్డ్స్ మళ్లీ నిషిద్ధ జాబితాలోకే
- నిబంధనల మేరకు చేసిన భూములకే క్లియరెన్సు
- అక్రమాలకు పాల్పడిన అధికారులపైనా చర్యలు

ఫ్రీహోల్డ్ భూముల వివరాలు (ఎకరాల్లో)

ఫ్రీహోల్డ్ చేసిన మొత్తం భూములు	1,59,327.5
అక్రమంగా చేసినవి	1,05,409.7
నిబంధనల మేరకు చేసినవి	53,917.8

చిత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు ఫ్రీహోల్డ్ చేసిన భూములకు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించనున్నట్లు సమాచారం. ఈ విషయమై అధ్యయనానికి నియమించిన మంత్రివర్గ ఉప సంఘం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో సక్రమంగా జరిగిన 53,917.8 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు మాత్రమే రిజిస్ట్రేషన్లు కానున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ అక్రమాలను నిగ్గు తేల్చింది. జిల్లాలో మొత్తం 1,59,327.5 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌గా మార్చగా, వాటిలో 1,05,409.7 ఎకరాలను అక్రమంగా చేసుకున్నట్లు తేలింది. దీంతో మొత్తం 1,59,327.5 ఎకరాల రిజిస్ట్రేషన్లనూ ప్రభుత్వం నిలిపేసింది.

● అసలైన లబ్ధిదారుల్లో వ్యతిరేకత

అక్రమ ఫ్రీ హోల్డ్ భూములను ఏం చేయాలి? అక్రమార్కులకు సహకరించిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి మంత్రివర్గ ఉప సంఘం, కమిటీలను ఏర్పాటు చేసింది. అక్రమ ఫ్రీహోల్డ్‌లపై, అధికారులపై చర్యలు తీసుకోకుండానే ఏడాది గడిచిపోయింది.దీంతో క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో సక్రమంగా ఫ్రీహోల్డ్ అయిన భూములకు మాత్రం క్లియరెన్సు ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది.

● అక్రమాలు జరిగాయిలా..

20 ఏళ్ల గడువు ముగియకున్నా, క్షేత్రస్థాయిలో భూమికి లబ్ధిదారులు లేకున్నా, ఇతర ఉల్లంఘనలు జరిగినా.. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా వేల ఎకరాల అసైన్డ్ భూములను గత ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి తప్పించేసింది. ఈ క్రమంలో భారీస్థాయిలో అక్రమాలు చోటు చేసుకున్నాయని కూటమి ప్రభుత్వ ప్రాథమిక విచారణలో తేలడం.. దానికి తోడు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం కావడం.. వంటి కారణాలతో గత ఆగస్టు నుంచి ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపేసింది.

● పలు మండలాల్లో పెద్దఎత్తున అక్రమాలు

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ అక్రమాలుపై జరిగిన టాప్ 10 మండలాలను ప్రభుత్వం విడుదల చేస్తే 4, 5, 10 స్థానాల్లో వి.కోట, కుప్పం, బంగారుపాళ్యం మండలాలు నిలిచాయి. వి.కోట మండలంలో మొత్తం 12,226 ఎకరాల డీకేటీని ఫ్రీహోల్డ్ భూములుగా మార్చితే.. వాటిలో అత్యధికంగా 9,243 ఎకరాలు అక్రమమని తేలాయి. అలాగే కుప్పం మండలంలో 8674 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేస్తే, 8400 ఎకరాలు అక్రమంగా చేశారు. బంగారుపాళ్యంలో 8042 ఎకరాల్లో 7198 ఎకరాలు అక్రమమే. ఈ మూడు మండలాలతో పాటు చిత్తూరు అర్బన్, గుడిపాల, తవణంపల్లె, ఐరాల, గుడుపల్లె వంటి మండలాల్లోనూ పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

● 1.05 లక్షల ఎకరాలు మళ్లీ డీకేటీలుగా..

జిల్లాలో 1.05లక్షల ఎకరాల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటితో పాటు సక్రమంగా జరిగిన భూమినీ హోల్డ్‌లో పెట్టేసింది. ప్రస్తుతం నిబంధనల మేరకు జరిగిన భూములకు క్లియరెన్సు ఇచ్చి, 1.05 లక్షల ఎకరాల్ని మళ్లీ డీకేటీలుగా మార్చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఫ్రీహోల్డ్ విషయంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగిన మండలాల్లో అప్పట్లో పనిచేసిన అన్ని స్థాయి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ఇప్పటికే ఆదేశించింది. కాబట్టి ఆ పది మండలాల్లో అప్పట్లో పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీఎం రాకకు

తిమ్మరాజుపల్లె సిద్ధం

- 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట 26కుటుంబాలకు రేపు బాబు పలకరింపు
- తుమ్మిశిలో సభ,పథకాల పంపిణీ, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



తిమ్మరాజుపల్లె



తిమ్మరాజుపల్లెలో ఇల్లులేని రాజు వేసుకున్న ఈ షెడ్డుకు కూడా సీఎం వెళ్లనున్నారు

కుప్పం/శాంతిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన 2వ తేదీకి ఖరారైంది. ఆ రోజు జరగనున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారంనాటి సాయంత్రమే ఆయన కుప్పం రానున్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలు, అందించిన పాలన గురించి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తిమ్మరాజుపల్లెలో సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం తుమ్మిశి వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొని వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ప్రయోజకాలను పంపిణీ చేయడమే కాక, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కుప్పంలో అధికారుల హడావుడి అధికంగా ఉంది. కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, స్థానిక అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఏలూరు పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయల్దేరి, శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డులోని డుంకుమానిపల్లె వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి నేరుగా కడపల్లె పంచాయతీ పరిధిలోని స్వగృహానికి చేరుకుంటారు. ఆ రాత్రి ఇక్కడే బస చేస్తారు.

2వ తేదీ ఉదయం 8 గంటలకల్లా స్వగృహం ఉన్న తిమ్మరాజుపల్లెకు చేరుకుని 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే 26 ఇళ్లను ఎంపిక చేశారు. ఆయా ఇళ్లకు సీఎం వెళ్తారు. వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలు, లబ్ధి గురించి ఆరా తీస్తారు. ప్రభుత్వపరంగా అమలవుతున్న పథకాల గురించి వివరిస్తారు. సాదకబాదకాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తారు. తెలుగుదేశం పార్టీపరంగా 60మంది ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన కుటుంబ సాధికార సమితి (కేఎస్ఎస్) పరిధిలోకి వచ్చే ఇళ్లనే సీఎం సందర్శించేలా స్థానిక రాజకీయ నాయకత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. అనంతరం తుమ్మిశి మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనే సీఎం వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు.ఎలక్ట్రిక్ ఆటోలు, ఎలక్ట్రిక్ సైకిళ్లు, వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేస్తారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఏస్ ఇండస్ట్రీస్, ఈ- రాయిస్, ఎస్వీఎఫ్ సోయా కంపెనీలతో కడా తరఫున ఎంవోయూలపై సంతకాలు చేస్తారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి చేరుకుని ప్రభుత్వ భాగస్వామ్యంతో టాటా కన్సల్టెన్సీ ద్వారా ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ)ను ప్రారంభిస్తారు.అదేరోజు సాయంత్రం కుప్పం నుంచి ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణమవుతారు.



సభా వేదిక ప్రాంగణంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

● సీఎం పర్యటన షెడ్యూల్

మంగళవారం సాయంత్రం

5.25 పీఎం - శాంతిపురం మండలం డుంకుమానుపల్లె హెలిప్యాడ్‌కు రాక

5.35 పీఎం - శాంతిపురం కడపల్లె వద్ద ఉన్న స్వగృహానికి చేరిక.రాత్రి బస

బుధవారం

8ఏఎం టు 10.45 ఏఎం - తిమ్మరాజుపల్లెలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం

10.55 ఏఎం టు 1.50 పీఎం - తుమ్మిశి మోడల్ స్కూల్ సమీపంలో సభ, వివిధ ప్రభుత్వ, సంక్షేమ పథకాల ప్రారంభం, లబ్ధిదారులకు పంపిణీలు

1.55 పీఎం టు 2.55 - కడపల్లెలోని స్వగృహం

3.05 పీఎం టు 4.05 పీఎం - కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభం

4.20 పీఎం - డుంకుమానుపల్లె హెలిప్యాడ్ చేరుకుని తిరుగు ప్రయాణం.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి కుప్పం పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్న డుంకుమానుపల్లె, 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించనున్న తిమ్మరాజుపల్లె, బహిరంగ సభ జరగనున్న తుమ్మిశి మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభావేదిక ప్రాంగణాలను సందర్శించి అధికార యంత్రాంగానికి తగు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, సంబంధిత అంశాలపై అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్ (ఏఎస్ఎల్)లో భాగంగా ముఖ్యమంత్రి పర్యటనకు తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో తిమ్మరాజుపల్లెలో కానీ, బహిరంగ సభలో పాల్గొనే ప్రజలకు కానీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లతో సిద్ధం కావాలని సూచించారు. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ భద్రత, వైద్య సేవల మెరుగుదలపై అధికారులకు సూచనలిచ్చారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీపీవో ప్రభాకర రావు, డీపీవో ప్రభాకర్, ఏఎస్పీ నందకిశోర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి, ఆర్డీవో శ్రీనివాసరాజు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపల్లె దశ మారింది

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తిమ్మరాజుపల్లె దశ మారిపోతోంది. కోటి రూపాయల వ్యయంతో గ్రామం రూపురేఖలను మార్చుతున్నారు. ఈ గ్రామంలోనే ఎంపిక చేసిన 26 ఇళ్లకు చంద్రబాబు వెళ్లనున్నారు. ఇల్లే లేకుండా గుడారంలో నివాసమున్న నిరుపేద రాజు ఇంటినుంచీ ధనవంతుల దాకా ఈ 26 మందిలో ఉన్నారు. అన్ని ఇళ్లకు అధికారులు వరుస ప్రకారం నెంబర్లు ఇచ్చారు. మంగళవారం సోమవారం ఉదయంనుంచి కరెంటు స్తంభాలు లేనిచోట్ల వాటిని నిలబెడుతున్నారు. బల్బులు మారుస్తున్నారు. ఇంటింటికీ తాగునీటి పైపులైన్లు నిర్మించి, పంచాయతీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారినుంచి తిమ్మరాజుపల్లెకు సుమారు 3 కిలోమీటర్ల తారు రోడ్డును పునరుద్ధరించారు. ఊరంతా పరిశుభ్రం చేశారు.



ట్రాఫిక్ విధుల్లో ఎస్పీ

కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మణికంఠ సోమవారం కుప్పం ట్రాఫిక్ విధుల్లో కనిపించారు. ట్రాఫిక్ పోలీస్ ద్విచక్ర వాహనం అధిరోహించి పట్టణంలో తిరుగుతూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రద్దీ ప్రదేశాలలో ఆగి, వాహనదారులకు ట్రాఫిక్ గురించి అవగాహన కలిగించారు. ఎక్కడైనా మహిళలపట్ల నేరాలు జరుగుతుంటే త్వరితగతిన పోలీసులు హాజరు కావడానికి 112, 100 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ నెంబర్లు పోలీసులు అందుబాటులోకి రావడానికి సులభతరంగా ఉంటుందని చెప్పారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకు చైర్మన్ డీసీసీబీ) అమాస రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ (డీసీఎంఎస్) పి. సుబ్రహ్మణ్యం నాయుడు పదవీకాలాన్ని ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతనెల 26వ నుంచి నెలకు మాత్రమే అవకాశం కల్పించిన ప్రభుత్వం ఈనెల 27 నుండి డిసెంబరు 26 వరకు పదవీకాలాన్ని పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం మొదలు కానుంది. జిల్లాలోని 2,65,722 మందికి ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు అందజేసేందుకు అవసరమైన రూ.113.45 కోట్లు నిధులు జిల్లాకు చేరాయి. వీటిని గ్రామ, వార్డు ఉద్యోగులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని, పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి అందజేయలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషన్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

సమగ్రశిక్షలో బదిలీలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో సీఆర్పీ, పార్టుటైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, కేజీబీవీ సిబ్బంది బదిలీల ప్రక్రియ సోమవారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. 24 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వారిలో సీనియారిటీ ఆధారంగా 17 మందికి కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేపట్టారు. మరో ఐదుగురు విముఖత చూపారు. ఇద్దరు గైర్హాజరైయారు. అంతర్ జిల్లా బదిలీలకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. వీరు కోరుకునే జిల్లాలో ఖాళీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి కేటాయించనున్నారు. కౌన్సెలింగ్‌లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటల బీమాకు గడువు

చిత్తూరు సెంట్రల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పంటల బీమా ప్రకటించినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ఎకరానికి రూ.42 వేలు కాగా, రైతులు ప్రీమియం కింద రూ.840 ఆగస్టు 15లోపు చెల్లించాల్సి ఉంది. రాగి ఎకరానికి రూ.17 వేలు కాగా, ప్రీమియం కింద రైతులు రూ.170, కంది ఎకరానికి రూ.20 వేలు కాగా, ప్రీమియం కింద రూ.400 ప్రీమియం జూన్ 31లోపు చెల్లించాలి. వేరుశనగకు ఎకరాకు రూ.28 వేలు కాగా, ప్రీమియం కింద రూ.560, టమోటా ఎకరాకు రూ.30 వేలు కాగా ప్రీమియం కింద రైతులు రూ.1500 జూన్ 15లోపు చెల్లించాలని వివరించారు.

సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం

సీనియారిటీ జాబితాలో మార్పుపై నిరసన ● రెండు గంటలపాటు నిలిచిన ప్రక్రియ



సర్వేయర్ల బదిలీ ప్రక్రియలో వాగ్వాదం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సర్వేయర్లకు ఆది, సోమవారాల్లో బదిలీలు జరిగాయి. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 520 మందికి గాను 398 మందికి బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జరిగిన కౌన్సెలింగ్‌కు మూడు జిల్లాల అధికారులు, హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని బదిలీ చేశారు. సొంత మండలాలు కాకుండా పక్కనే ఉన్న మండలానికి పంపించారు. ర్యాంకుల ఆధారంగా ఈప్రక్రియ జరగ్గా, అధికారుల తప్పిదాల వల్ల తిరుపతి జిల్లాకు బదిలీ కావాల్సినవారు చిత్తూరు జిల్లాకు, చిత్తూరు జిల్లాకు బదిలీ కావల్సిన వారు తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యామంటూ ఆరోపించారు. సోమవారం గందరగోళం మధ్య కౌన్సెలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. పలుసార్లు సీనియారిటీ జాబితాలో మార్పులు చోటుచేసుకున్నాయి. దాంతో సర్వేయర్లకు తెలియకుండా, జాబితా ప్రచురించకుండానే జరిగిన కౌన్సెలింగ్‌లో కొందరు తమకు అనుకూలమైన సర్వేయర్లకు స్థానాలు కేటాయించేందులో అధికారులు అడ్డదారులు తొక్కారంటూ పలువురు అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. ఫలితంగా మధ్యాహ్నం రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ఆగిపోయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను పునఃప్రారంభించి 5 గంటలకు ముగించారు. కౌన్సెలింగ్‌లో చిత్తూరు జిల్లా సర్వేశాఖ ఏడీ జయరాజ్, అన్నమయ్య జిల్లా ఏడీ భరత్‌కుమార్, సూపరింటెండెంట్ రాజేంద్ర, తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



'హరిహర వీరమల్లు'లో పాట పాడా

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రంలో 'కొల్లగొట్టి నాదిరో' అనే ఓ పాట పాడానని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సినిమా పాటలతో పాటు దేవుడి పాటలూ పాడుతున్నట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాగే, సినీహీరో మాధవన్, నటి వాసుకి, మహారాష్ట్ర మంత్రి ప్రకాష్ అంబేద్కర్ తదితరులూ శ్రీవారిని దర్శించుకున్నారు.



రాహుల్ సిప్లిగంజ్ - మాధవన్



వాసుకి

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,497

తలనీలాలు సమర్పించినవారు: 29,054



నాసిరకం యంత్రాలు కొన్న వారిపై కేసు పెట్టాలి

టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ డిమాండ్



తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసేందుకు గత పాలకవర్గంలో మూడు నాసిరకం మిషన్లను కొన్నారని ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తుల సొమ్మును గత వైసీపీ పాలకులు నాసిరక మిషన్ల పాలు చేశారని విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసే మూడు మిషన్లను రూ.4కోట్లకు కొన్నారన్నారు. ఆయుష్ శాఖకు పంపించి తద్వారా ఆదాయం వస్తుందని చెప్పి వీటిని కొనుగోలు చేశారన్నారు. ఆ మూడు మిషన్లలో ఒకటి కాలిపోగా. మరో దానిలో మందుల పొడి బయటకు వస్తుందన్నారు. ఇంకోదానికి బోల్టులు ఊడిపోతున్నాయన్నారు. తమ పరిశీలనలో ఆ మిషన్లు సెకండ్‌హ్యాండ్‌విగా గుర్తించామన్నారు. ఈ మిషన్లను హైదరాబాద్‌కు చెందిన సాయితేజ స్టీల్‌కార్పొరేషన్ సప్లై చేసినట్లు తెలిసిందన్నారు. దీనిని ఓ చిన్న రేకుల షెడ్‌లో నడుపుతున్నారన్నారు. భక్తుల సొమ్ము రూ.4కోట్లను వృథా చేసి నాసిరకం మిషన్లు కొన్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్వరస్వామి సొత్తు తిన్నందుకే 11 సీట్లు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వేడుకగా 'భోగ్ బండారు'

తిరుమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరమభక్తుడైన హథీరాం బావాజీ జన్మదినం సందర్భంగా తిరుమలలో సోమవారం 'భోగ్ బండారు' జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బంజారా తెగకు చెందిన భక్తులు 'భోగ్ బండారు' పేరుతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హాజరు కాగా.. బంజారా తెగకు హథీరాం బావాజీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని వారు వివరించారు. బంజారాల మహంత్ రమేష్‌గురు మహరాజ్ మాట్లాడుతూ.. బంజారాల కులగురువు హథీరాం బావాజీ 596వ జన్మదిన వేడుకలను హథీరాం మఠంలో వైభవంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ఏడు రాష్ట్రాల నుంచి బంజారీలు పాల్గొన్నారన్నారు అనంతరం వారు తిరుమలలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించారు.




బంజారీలతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

సిబ్బంది లేకుంటే గస్తీ ఎలా?

ప్రతి ఆరు బోగీలకు ఇద్దరు జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది భద్రతా విధుల్లో ఉండాలి.

కానీ, 24 బోగీలకు కలిపి కేవలం ఇద్దరే ఉంటున్నారు.



- రైల్వేలో గస్తీ సిబ్బంది కొరతకు ఇదే నిదర్శనం. ఇది రైళ్లలో చోరీలు, దోపిడీలపై ప్రభావం చూపుతోంది.

- రైల్వేలో పీడిస్తున్న కొరత
- తిరుపతి సబ్ డివిజన్‌లో 39 కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీ
- పెరుగుతున్న చోరీలు, దోపిడీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల రైళ్లలో చోరీలు, దోపిడీలు పెరిగాయి. చిత్తూరు రూరల్ మండలం సిద్దంపల్లి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ నెల 26వ తేది తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో రైల్వే సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ చేశారు. రెండు బోగీల్లోకి చొరబడిన దుండగులు నలుగురు ప్రయాణికుల నుంచి 70 గ్రాముల బంగారు నగలు కాజేశారు. మే 2న చంద్రగిరి మండలం ముంగిలిపట్టు రైల్వే స్టేషన్ పరిధిలో హోమ్ సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైంది. రెడ్ లైటు వెలుగుతుండడంతో రైలు ఆగింది. ఇంతలోనే దుండగులు బోగీలోకి దూరి ఇద్దరు మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్లారు. తాజాగా శనివారం అర్ధ రాత్రి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద దుండగులు చోరీకి యత్నించారు. ఇలా ఇటీవల రైళ్లల్లో చోరీలు, దోపిడీలు పెరుగుతున్నాయి. దాదాపు ఒకే తరహాలో దుండగులు దోపిడీకి పాల్పడుతున్నారు. గస్తీ సిబ్బంది తగు సంఖ్యలో లేకపోవడంతోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎందుకంటే.. రైల్లో గస్తీ నిర్వహించే పోలీసులు.. బోగీల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే విచారించాలి. అదుపులోకి తీసుకోవాలి. కానీ రైలుకంతా కలిపి ఇద్దరే ఉంటున్నారు. దీంతో వీరు పూర్తిస్థాయిలో గస్తీపై దృష్టి పెట్టలేకున్నట్లు సమాచారం. గత 20 సంవత్సరాలుగా పదవీ విరమణతో ఖాళీ అవుతున్న స్థానాలు భర్తీ కావడం లేదని, సివిల్ పోలీసు నుంచి డిప్యుటేషన్‌పై రైల్వే శాఖకు రావడానికి చాలామంది అయిష్టత చూపుతున్నారని తెలుస్తోంది.

తిరుపతి సబ్ డివిజన్‌లో..

ప్రధానంగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో ఏఎస్‌ఐలు ఒకరంటే ఒకరు కూడా లేరు. నలుగురు ఎస్‌ఐలకుగాను ఇద్దరే ఉన్నారు. ఇక 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు గాను సివిల్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ముగ్గురే పనిచేస్తున్నారు. 49 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, పనిచేసేది పది మందే. వీరికి కోర్టు డ్యూటీలు, సమన్లు ఇవ్వడం, శవ పంచనామాలు నిర్వహించడం వంటి ఇతరత్రా డ్యూటీలూ ఉన్నాయి. దీంతో రైళ్లలో విధులు నిర్వహించడానికి అవసరమైన సిబ్బంది లేకుండా పోయారు. దీంతో దుండగులు సిగ్నల్ వ్యవస్థలు ట్యాంపరింగ్ చేయడం, రైళ్లలో ప్రయాణికుల్లా ప్రయాణించి దోపిడీలకు పాల్పడుతున్నారు.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

రైల్వే శాఖలో సిబ్బంది కొరత వాస్తవమే. అయితే తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఉన్న సిబ్బందితో ప్రయాణికుల భద్రత ధ్యేయంగా గట్టిగా బందోబస్తు చేస్తున్నాం. ఇటీవల రైలు దోపిడీలు, చోరీలను సవాల్‌గా తీసుకుని మరింత పకడ్బందీగా పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి పూట అన్ని బోగీలు తనిఖీ చేసి నివేదికలు తెప్పించుకుంటున్నాం. అనుమానితుల వేలిముద్రలు సేకరించే పని ముమ్మరం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే జీఆర్పీఎఫ్ సీఐ, తిరుపతి

ఈ-సిమ్ పేరుతో టోకరా

రూ.1.90 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ మహిళ ఖాతాలో నుంచి రూ.1.90 లక్షలు కాజేశారు. తడ మండల పరిధిలోని పెరియవట్టు గ్రామానికి చెందిన ఈదూరు శ్రీదేవికి స్థానిక కెనరా బ్యాంక్‌లో ఖాతా ఉంది. పది నెలల క్రితం పొదుపు సంఘం ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకుంది. ఇంటి నిర్మాణానికి ఖర్చు చేద్దామన్న ఉద్దేశంతో ఆ డబ్బును ఖాతాలోనే ఉంచింది. బ్యాంక్ ఖాతాకు ఆమె కుమారుడు లోకనాథం ఫోన్ నెంబరును జత చేసింది. ఇదిలా ఉండగా గత శనివారం లోకనాథం ఫోన్‌కు ఈ-సిమ్ కావాలంటే తమను సంప్రదించాలంటూ ఎస్ఎంఎస్ ద్వారా ఈ లింక్ వచ్చింది. లోకనాథం ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో కొద్ది నిమిషాల తరువాత ఫోన్ హ్యాంగ్ అయింది. వెంటనే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీ సెండ్ చేస్తే మీ ఫోన్ సాధారణ స్థితికి వస్తుందంటూ మరో మెసేజ్ రావడంతో లోకనాథం ఆ ఓటీపీని అలాగే ఫార్వాడ్ చేశాడు. అప్పటి నుంచి ఆదివారం వరకు అతని ఫోన్ పనిచేయలేదు. సోమవారం బ్యాంక్ ఖాతా నుంచి రూ.25వేలు నగదు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో లోకనాథం ఖంగుతిన్నాడు. వెంటనే తల్లిని తీసుకొని బ్యాంక్‌కు వెళ్లి విచారించగా తన ఖాతాలో ఉండాల్సిన రూ.1.90 లక్షలు మరో అకౌంట్‌లోకి వెళ్లిపోయినట్లు బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.





WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111

డిజిటల్ నెర్వ్ సిస్టమ్‌తో
పీహెచ్‌సీల్లో నాణ్యమైన వైద్యసేవలు


డిజిటల్ నెర్వ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న వీరపాండ్యన్

రామకుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం డిజిటల్ నెర్వ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ తెలిపారు. టాటా గ్రూపు సౌజన్యంతో రామకుప్పం మండలం విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సిస్టమ్ పనితీరును సోమవారం ఆయన పరిశీలించారు. సిస్టమ్ పని తీరు, ప్రజలకు అందే నాణ్యమైన వైద్యసేవలపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అభా కార్డులను క్రియేట్ చేసుకుని నాణ్యమైన వైద్యసేవలను ఉచితంగా పొందాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.దేవీ, డీఎంహెచ్‌వో డా.సుధారాణి, డీయోస్సీ ఐటీ మేనేజర్ డా.పద్మాంజలి, పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

నగరి, జూన్30 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగ నుంచి నాలుగు మోటార్ బైక్‌లను నగరి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో సీఐ విక్రమ్, ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి ఎస్.నర్గుణన్‌ను పట్టుకున్నారు. ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ పరిధిలో నాలుగు మోటార్‌బైక్‌లను దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించారు. రూ.1,50,000 విలువ చేసే నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తమిళనాడులోని తిరుత్తణికి చెందినవాడు. ఇతడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసులో ప్రతిభ చూపిన సిబ్బంది సురేష్, సత్య, గజేంద్ర, అశోక్, లోకనాథం, రమేష్‌లను సీఐ అభినందించారు.

నేటి నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మంగళవారం నుంచి 5,43,202 బియ్యం కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్నట్లు డీఎస్‌వో శంకరన్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌకదుకాణాలకు 8,250 టన్నుల బియ్యం, 250 టన్నుల పంచదార సరఫరా చేశామన్నారు. కార్డుదారుడికి ఉచిత బియ్యం, నగదుకు అరకిలో వంతున పంచదారను డీలర్లు అందిస్తారన్నారు. 1వ తేదీ నుంచి 15వరకు విధిగా డీలర్లు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దుకాణాలను తెరచి ఉంచాలన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ వాయిదా


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా పడింది. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో సోమవారం చిత్తూరు పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్‌మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది.ఉమ్మడి జిల్లాలో 664 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదివారం, సోమవారం 449 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల బదిలీలను వాయిదా వేశారు. సీఎం పర్యటన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

13 టన్నుల రేషన్‌బియ్యం స్వాధీనం

- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు


వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అధికారులు

నగరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టులోని ఓహోటల్ సమీపంలో 13టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు వాహనాల నుంచి మరో వాహనంలోకి ఈ బియ్యం లోడ్ చేస్తుండగా దాడి చేసినట్లు సీఐ విక్రమ్ తెలిపారు. పుత్తూరు, పిచ్చాటూరు, నారాయణవనం మండలాల నుంచి తీసుకొచ్చిన రేషన్‌బియ్యంగా గుర్తించారు. నాలుగు చిన్నవాహనాలను, ఒక పెద్ద వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అమృతరాజ్ నాడార్,ధనుష్‌బోస్,రోహిత్,దినేష్,గజేంద్రన్,రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

10న జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం


పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తున్న డీఐఈవో శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా జూనియర్ కళాశాలల్లో చేపట్టదలచిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక ఆర్‌కే జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ఈనెల 10న జూనియర్ కళాశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు అందించే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. సబ్జెక్టుల వారిగా విద్యార్థుల పురోగతి నివేదికలు తల్లిదండ్రులకు చూపాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ సందర్భంగా డీఐఈవో, కడప ఆర్జేడీ శ్రీనివాసులను ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సన్మానించారు

ఇంకెన్ని సార్లు తిరగాలి?

ఆర్డీవో ఆదేశాలు అమలుకు నోచుకోకపోవడంపై అర్జీదారుల ఆవేదన

పలమనేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలువురు తహసీల్దార్లు ఆర్డీవో ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. తహసీల్దారులే కాకుండా కొందరు కిందిస్థాయి రెవెన్యూ ఉద్యోగులు సైతం ఆర్డీవో ఆదేశాలు పాటించక పోవడంతో రైతులు పదే పదే ప్రజా ఫిర్యాదుల దినంలో ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాలు అందిస్తూనే ఉన్నారు. పలమనేరులో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద గ్రీవెన్స్‌డేకు వచ్చిన పలువురు రైతులు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తహసీల్దార్లు స్థానిక రాజకీయ ఒత్తిళ్లతో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యలు చెప్పుకున్నా... రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అదే సమస్యలపై ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటున్నారు. తాను తహసీల్దార్లకు సూచించినా పరిష్కారం చూపకుంటే తానేమి చేసేదంటూ ఆర్డీవో పి.భవాని అర్జీదారుల ఎదుట నిస్సహాయతను తెలియజేయడం గమనార్హం. కోర్టు తీర్పులు ఉన్నా.. వంశపారంపర్యంగా వచ్చిన భూములకు సంబంధించి రైతులు పట్టాదారు పాసు పుస్తకాల కోసం చేసుకొన్న మ్యుటేషన్లను (ఆన్‌లైన్‌లో చేసుకొన్న దరఖాస్తులు) తహసీల్దార్లు తిరస్కరిస్తున్నారు. అయితే అందుకు గల కారణాలు తెలియజేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి. జిల్లా అధికారులైనా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


అర్జీదారుడి సమస్యను వింటున్న ఆర్డీవో భవాని

అర్జీలిస్తూనే ఉన్నా.. పరిష్కారం కాలేదు



వి.కోట మండలం ముదరండొడ్డి గ్రామానికి చెందిన రైతు ఎం.చిన్నకన్నయ్య 1973లో గ్రామ సమీపంలో 57 సెంట్ల భూమిని పట్టా చేసుకున్నారు. అయితే అనివార్య కారణాలతో ఆ భూమికి సంబంధించిన వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. దీనిపై గత కొన్నినెలలుగా చిన్నకన్నయ్య తనపేరున భూమి రికార్డులను బదలాయించాలని కోరుతూ అర్జీలు ఇస్తున్నా నేటికీ రికార్డుల్లో అతని పేరున అధికారులు మార్పులు చేయలేదు. దీంతో సోమవారం మళ్లీ ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందించారు.

నష్టపరిహారం అందించాలి



చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం పలమనేరు మండలం కల్లాడు గ్రామానికి చెందిన రైతు కృష్ణారెడ్డికి చెందిన భూమిని రహదారి నిర్మాణానికి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి నష్టపరిహారం కోసం 2017న తమ గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరాలు తెలిపారు. అయితే ఆ అభ్యంతరాలు కేవలం తప్పుడు సమాచారమని.. ఇప్పటికీ తన భూమికి సంబంధించి నష్టపరిహారాన్ని ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తహసీల్దారు కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం ఉండటం లేదు. కనీసం ఎవరెవరికి పరిహారం జమచేశారన్న వివరాలు చెప్పడం లేదని.. ఇకనైనా తన భూమికి సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

పంటలపై గజరాజుల విధ్వంసం

- నేలకొరిగిన కొబ్బరి, మామిడిచెట్లు


ఏనుగులు తోసేసిన టెంకాయచెట్టు - ధ్వంసమైన మామిడి తోటకు వేసిన కూశాలు

కల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. పగలంతా అడవిలో ఉంటున్న ఏనుగుల గుంపు రాత్రి వేళల్లో పంటలకు నష్టం కలిగిస్తూ రైతులకు కన్నీళ్లు మిగిలిస్తున్నాయి. ఆదివారం రాత్రి తూర్పు విభాగం అటవీప్రాంతంలోని ఎగువచలం నుంచి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు పాళెం పంచాయతీలోకి ప్రవేశించాయి. ముందుగా కోటపల్లిలోని రైతు హంసవేణికి చెందిన మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను ధ్వంసంచేశాయి. అక్కడి నుంచి కోటపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు అరుపులు పెట్టడంతో ఏనుగులను చూసేందుకు గ్రామస్తులు మిద్దెలపైకి చేరుకున్నారు. అప్పటికే గ్రామానికి ఆనుకొని ఉన్న మామిడిచెట్లను విరిచేస్తున్న ఏనుగులను లైట్లు సాయంతో చూసేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. లైట్ల వెలుతురును గుర్తించిన ఏనుగులు ఘీంకారాలు చేశాయి. కోటపల్లిలోని రైతు గోపికి చెందిన సుమారు 30 ఏళ్ల కొబ్బరిచెట్టును కూకటివేళ్లతో పెకలించాయి. రైతులు బాబునాయుడు, హరినాయుడు, చెన్నకేశవులుకు చెందిన పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు సుబ్రహ్మణ్యానికి చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. కల్లూరుకి చెందిన రైతులు పురుషోత్తం, యుగంధర్‌కు చెందిన మామిడిచెట్లు, కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు కంచెకు అమర్చిన 30 రాతి కూసాలను, పైపులను విరిచేశాయి. మరో రైతు సుబ్బరాజుకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడినుంచి ఎస్సార్ పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారి వద్దకు చేరుకొని రోడ్డును దాటేందుకు ప్రయత్నించాయి. రహదారిపై వాహనాలు వెలుతుండటంతో ఏనుగుల గుంపు వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను సోమవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. 17 ఏనుగుల గుంపు అడవిలోని చింతలవంక వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

- ఎస్పీ మణికంఠ


సమావేశంలో సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ

కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఈనెల 1, 2 తేదీలలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో కుప్పంలో సోమవారం ఎస్పీ సమావేశమయ్యారు. ప్రతిఒక్కరూ అలసత్వం వహించకుండా తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. హెలిప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణం, ఇంటింటి పర్యటన జరుగనున్న గ్రామం, టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో పటిష్ఠమైన బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అధికారులు, ముఖ్య నాయకుల వాహనాలకు, ఇతర వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిశోర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మనోహర్, జిల్లా బందోబస్తు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికాలేదని మనస్తాపంతో ఆత్మహత్య

బంగారుపాళ్యం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని శేషాపురానికి చెందిన రమేష్‌బాబు పెళ్లి కాలేదని మనోవేదన గురయ్యేవాడు. ఈక్రమంలోనే వారం క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం శేషాపురం సమీపంలోని తోటలో మామిడి చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని కూలీలు గుర్తించారు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు రమేష్‌బాబుగా నిర్ధారించారు. శవం పూర్తిగా పాడవడంతో మామిడి తోటలోనే పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుట్టినరోజు వేడుకలకు వస్తూ ప్రమాదంలో మృతి


శ్యామ్ జయకరణ్ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం,జూన్30 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజును సియోన్‌మలై ప్రార్థన మందిరంలో జరుపుకోవడానికి బెంగళూరు నుంచి వస్తూ రోడ్డుప్రమాదంలో మృతిచెందాడో యువకుడు.. వివరాలిలా ఉంది... బెంగళూరు కేజీ హళ్ళి, గాంధీనగర్‌కు చెందిన శ్యామ్ జయకరణ్(30) వృత్తిరీత్యా బెంగళూరులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. సోమవారం తన పుట్టినరోజును ఎప్పటిలాగే గుడిపాల మండలం నరహరిపేట సమీపంలో సియోన్ మలై చర్చిలో జరుపుకోవడానికి బెంగళూరు నుండి సోమవారం వేకువజామునే ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. బంగారుపాళ్యం మండలం పాలేరు సమీపానికి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. శ్యామ్ జయకరణ్ (30) అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యులు, స్నేహితులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకుని బోరున విలపించారు. ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయుడు మిలిటరీ హోటల్‌లో
శ్రీవారి గర్భాలయ నమూనా సెట్

- మాంసాహారం విక్రయిస్తున్న హోటల్‌పై చర్యలు తీసుకోండి
- టీటీడీ అదనపు ఈవోకు కిరణ్‌రాయల్ ఫిర్యాదు


రాయుడు హోటల్‌లో వేసిన నమూనా ఆలయ సెట్టింగ్


అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్ రాయల్

తిరుమల, జూన్30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి గర్భాలయ తరహాలో నమూనా ఆలయ సెట్టింగు వేసి నాన్‌వెజ్ విక్రయిస్తున్న రాయుడు మిలటరీ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన నేత కిరణ్‌రాయల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను వ్యాపారాలకు వాడుకుంటున్న వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజమండ్రి నుంచి వైజాగ్‌కు వెళ్లే హైవేలో రాయుడు మిలటరీ హోటల్‌లో శ్రీవారి గర్భాలయ నమూనా సెట్టింగ్ వేశారన్నారు. అందులో జయ విజయులతో పాటు శ్రీవారి విగ్రహాన్నీ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. 'తిరుమల అన్నప్రసాదం తరహాలోనే మేమూ పెడుతున్నాం అని ఆ హోటల్ నిర్వాహకుడు అంటున్నాడు. ఓరెయ్ వెదవ. మేము నాన్‌వెజ్ పెడుతున్నామా? ప్యూర్ వెజిటేరియన్ పెడుతున్నాం. వేంకటేశ్వర స్వామి భక్తులంటే ఎలా కనిపిస్తున్నారు నీకు' అంటూ ఆ హోటల్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ హోటల్‌లో నాన్‌వెజ్ వాసన వస్తుంటే.. మరోవైపు నమూనా సెట్టింగులో శ్రీవారి విగ్రహానికి హారతి ఇస్తున్నారంటూ ఆవేదనతో అమెరికా, జర్మనీ దేశాల్లోని భక్తుల నుంచీ తమకు వీడియోల సహా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. 24 నుంచి 48 గంటల్లోపు ఆలయ నమూనాను తొలగించకుంటే శ్రీవారి భక్తులు దాడి చేస్తారని హెచ్చరించారు. టీటీడీలో ప్రత్యేకంగా ఓ వింగ్‌ను ఏర్పాటు చేసి సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని కోరారు. ఫుడ్ కార్పొరేషన్ అధికారులతోనూ టీటీడీ అధికారులు మాట్లాడారని, రాయుడు మిలటరీ హోటల్ లైసెన్స్‌ను రద్దు చేయిస్తామన్నారు.

జైన్ ఫ్యాక్టరీ ఎదుట కొనసాగుతున్న రద్దీ

- మామిడి రైతుల ధర్నాపై స్పందించిన కలెక్టర్
- ట్రాక్టర్ల క్రమబద్ధీకరణకు అధికారుల ప్రయత్నం


జైన్ ఫ్యాక్టరీ వద్ద బారులుతీరిన ట్రాక్టర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గంగాధరనెల్లూరు పంచాయతీ గొల్లపల్లె జైన్ ఫ్యాక్టరీ ఎదుట చిత్తూరు-పుత్తూరు రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల దూరానికి పైగా మామిడికాయల లోడ్లతో ట్రాక్టర్లు బారులుతీరాయి. ఆదివారం ఫ్యాక్టరీ వద్ద పలువురు రైతులు ధర్నాకు దిగిన క్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో జైన్ ఫ్యాక్టరీ నుంచి ఎట్టేరి దారిలో ఓ వైపు ట్రాక్టర్లను పూర్తిగా తీసేయించారు. సిఫార్సులతో ఏ ట్రాక్టర్ వాహనదారుడైనా మామిడికాయలను ఫ్యాక్టరీ లోపలికి అన్‌లోడింగ్‌కు తీసుకెళితే చర్యలు తీసుకుంటామన్నారు. క్యూలైన్లలో ఉన్న వారికి మాత్రమే టోకెన్లు ఇస్తామన్నారు. అధికారులు, నేతల సిఫార్సులతో ఎవరిపేర్లు చెప్పినా ఖాతరు చేయనక్కరలేదని తేల్చిచెప్పారు. సోమవారం రాత్రికి ఫ్యాక్టరీ వద్ద నుంచి ఎట్టేరి గ్రానైట్‌ఫ్యాక్టరీ వరకు అంటే సుమారు రెండు కిలోమీటర్లకు పైగా, అలాగే కోటాగరం బస్టాప్ నుంచి గ్రామంలోకి వెళ్ళేదారిలోనూ 332 ట్రాక్టర్లు బారులు తీరాయి.

రైళ్లలో చోరీలు, దోపిడీలు అరికట్టండి

- రైల్వే పోలీసులకు డీఐజీ సత్యఏసుబాబు ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో రైళ్లలో దొంగతనాలు, దోపిడీల నివారణకు కలిసికట్టుగా పనిచేయాలని విజయవాడ రైల్వే డీఐజీ సత్యఏసుబాబు ఆదేశించారు. రైళ్ల దొంగతనాలు, సిగ్నల్ ట్యాంపరింగ్‌లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడ నుంచి తిరుపతి రైల్వే అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నేరాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? బ్యాగ్ లిస్టర్లు, మొబైల్ దొంగలు ఎంతమందిపై కేసులు పెట్టారు? రోజూ ఎంతమంది గస్తీ చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు. రాత్రి బీట్లు గట్టిగా చేస్తే దొంగలకు భయం కలుగుతుందన్నారు. ఎక్కడ దొంగతనాలు, దోపిడీలు జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నేరాల కట్టడి, బ్యాగ్ లిస్టర్లు, మొబైల్ దొంగతనాల నివారణకు తీసుకున్న చర్యలపై సీఐ ఆశీర్వాదం వివరించారు.

650 మంది వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యూవల్

తిరుపతి(వైద్యం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కార్యక్రమంలో భాగంగా 650 మంది వైద్యులు రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఎన్‌వోసీలు నమోదు చేసుకున్నట్లు ఏపీ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే తరహాలో మళ్లీ ఆరు నెలల తరువాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు వారి ధ్రువపత్రాలను రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలని ఆయన వివరించారు.

ఈ బైక్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన ఈ బైక్‌లు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని జాయ్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన షోరూములో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళి మంటలను అదుపు చేశారు. అప్పటికే షోరూములోని ఫర్నిచర్, 10 ఈ- బైక్‌లు కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ 20.లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక సహాయ సంచాలకుడు కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఏపీ క్వాంటమ్ లీప్‌లో భాగస్వామ్యం

- వర్క్‌షాప్‌కు ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ వీసీల హాజరు


పాల్గొన్న వీసీలు అప్పారావు, ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిని క్వాంటమ్ టెక్నాలజీకి కేంద్రంగా నిలపాలని సీఎం చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి విజయవాడలోని నోవాటెల్‌లో సోమవారం వర్క్‌షాప్ చేపట్టారు. ఈ వర్క్‌షాప్‌నకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I,MUKTHAPURAM DIVAKARA REDDY (Old Name) S/o. Late MUKTHAPURAM VENKATA REDDY, R/o. Plot No. 219, NR Layout, Vedantha puram, Tirupati Rural, TIRUPATI Dist -517507, A.P. Has changed my name as MUKTHAPURAM DIVAKAR REDDY (New Name)
AJT - 397

వెంటనే కావలెను
లేసర్ మెషిన్ ఆపరేటర్, ఎంబ్రాయిడరీ మెషిన్ ఆపరేటర్, ఇన్వెంటరీ మేనేజర్, డేటా ఎంట్రీ, అర్హత : 10th Pass ప్రత్యేకమైన నైపుణ్యాలు అవసరం లేదు. పూర్తిస్థాయి ఉద్యోగం. మరిన్ని వివరాలకు సంప్ర. Darshan Dresses, Cell : 9505751243 / 9440250863.
AJT - 239882

PLOTS FOR SALE
ఎర్రచందనం మొక్కలతో సహా ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు IIT తిరుపతి దగ్గరలో స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ ఓనర్, ఫోన్ : 95027 74175, 79959 92114
AJT -1382

WANTED
Wanted teachers for Higher class All Subjects and Computers Teacher,Hostel CooK, for a Reputed School in S.N Puram, Tirupati, Attractive Salary, Cell: 92908 98331,70138 81383.
AJT - 1393

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237881

నేపాల్ రైలు యాత్ర
మహాలయ పక్షంలో నేపాల్ (ముక్తినాథ్) తేది. 06-09-25. 12 రో టికె 25,000/- (రైలు, భోజనం, రూం, A/c బస్సు). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-212094

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పంపించబడిన /క్లెయిమ్స్‌కు, బట్వ వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సమాజాభివృద్ధికి అధ్యాపకుల కీలకపాత్ర



ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీనివాసమూర్తి

పుంగనూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి కృషి చేయడంలో కీలకపాత్ర పోషించేవారే అధ్యాపకులని శుభారాం ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన జీవిత కాలంలో ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అనంతరం పలువులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు చంద్రశేఖర్, నరసింహులు, వెంకటకృష్ణయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



జిల్లా కోర్టు ఎదుట కుప్పం టీడీపీ నాయకులు

కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసుల్లో సోమవారం కుప్పం తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్వకేట్ చంద్రశేఖర్‌తో కలిసి చిత్తూరులోని జిల్లా కోర్టుకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ జడ్పీటీసీ మునస్వామి, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్, మంజునాథ్, చెక్కునత్తం మణి, అప్పు ముఖేశ్, మునెప్ప తదితరులు కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు.

రోటరీక్లబ్ సామాజిక సేవలకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పుంగనూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు అందించిన పుంగనూరు రోటరీక్లబ్‌కు అవార్డులు అందాయని క్లబ్ అధ్యక్షుడు ఆవుల హరిప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రైవేటు మండపంలో జరిగిన రోటరీక్లబ్ ప్రతినిధుల సమావేశంలో పుంగనూరు రోటరీక్లబ్ అందించిన సేవలను గుర్తించి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సూర్యప్రకాశ్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, డిష్ రాజారెడ్డి, డాక్టర్ శరత్‌కుమార్, బాస్కర్‌జెట్టి, నానబాల గణేశ్, అనిల్, పూల త్యాగరాజు, ఎస్వీటీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయసింహ

కల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని తహసీల్దార్ జయసింహ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన భూముల రీ సర్వేలో తలెత్తిన లోపాలను రైతులు సరిచేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటి స్థలాల కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని తహసీల్దారు హెచ్చరించారు.

బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా శరవణకుమార్



పలమనేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు చెందిన సీనియర్ బీజేపీ నాయకులు శరవణ కుమార్ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి తనకు మరింత బాధ్యతను తీసుకొచ్చిందని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతూ బీజేపీ పటిష్టతకు కృషిచేస్తానని తెలిపారు.

కుప్పం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా తులసీనాథ్



కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం కుప్పం నియోజకవర్గానికి సంబంధించి బీజేపీ సంస్థాగత వ్యవహారాలు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను తులసీనాథ్ చూస్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు సైతం ఇకపై జరిగే కార్యక్రమాలకు తులసీనాథ్‌ను ఆహ్వానించాలని జిల్లా అధ్యక్షుడు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

స్వప్న దేవి అలంకరణలో వైష్ణవిదేవి

చౌడేపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి సోమవారం వారాహిదేవి నవరాత్రులు సందర్భంగా ఐదోరోజు అమ్మవారు స్వప్న దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దేవాలయ రిజిస్టర్ గురించి

చిత్తూరు జిల్లా, రామకుప్పం మండలం, పెద్దకురబలపల్లి గ్రామంలో వెలసిఉన్న శ్రీకోదండరామ స్వామి దేవాలయము ను దేవాదాయ శాఖ నందు రిజిస్టర్ చేయుటకు ఏవైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన ప్రచురితమైన వారము దినములలో శ్రీయుత సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ చిత్తూరు, వారికి తెలుపవలసిందిగా శ్రీకోదండ రామస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ పెద్దకురబలపల్లి వారు కోరుతున్నారు.

శ్రీ కోదండరామ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ,
పెద్దకురబలపల్లి, రామకుప్పం మండలం,

నేడు గుండాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌పురంలో మంగళ, బుధవారాల్లో గుండాలమ్మ జాతర మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మురుగేషన్, రవినాయుడులు తెలిపారు. మంగళవారం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నటు పేర్కొన్నారు. కుంభ నైవేద్యం సమర్పించి, బుధవారం జల ప్రవేశం చేస్తామని తెలియజేశారు.

టీడీపీ క్లస్టర్ల ప్రక్షాళన

● నూతన ఇన్‌చార్జిల నియామకం

కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ల ప్రక్షాళనకు పార్టీ అధిష్టానం శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మొత్తం 12 క్లస్టర్ ఇన్‌చార్జీలను మారుస్తూ నిర్ణయం తీసుకుంది. క్లస్టర్ ఇన్‌చార్జీలుగా ఇంతవరకు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్లు ఉండేవారు. ఇప్పుడు వారందరినీ తొలగించి కొత్తవారిని ఇన్‌చార్జీలుగా నియమించారు. కుప్పం పురపాలక సంఘం, కుప్పం మండలాలకు చెరి మూడేసి క్లస్టర్లు ఉన్నాయి. అలాగే గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో చెరి రెండేసి క్లస్టర్లను ఏర్పాటు చేశారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కుప్పం పట్టణం, డీకే పల్లె, లక్ష్మీపురం, క్లస్టర్ ఇన్‌చార్జీలుగా వరుసగా సోమశేఖర్, కన్నన్, రోహిత్‌లను నియమించారు. అలాగే గుడుపల్లె మండలం గుడుపల్లె, శెట్టిపల్లె క్లస్టర్ ఇన్‌చార్జీలుగా బేటప్ప నాయుడు, బాలాజీ నియమితులయ్యారు. శాంతిపురం మండలం కెనమాకులపల్లె, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జీలుగా రాజేంద్ర, నాగరాజ్, రామకుప్పం మండలం రామకుప్పం, విజలాపురం క్లస్టర్ ఇన్‌చార్జీలుగా రవిరెడ్డి, నాగభూషణంలను నియమిస్తూ అధిష్టానం జాబితాను తయారు చేసి స్థానిక పార్టీ కార్యాలయానికి పంపింది. క్లస్టర్ ఇన్‌చార్జీలను మార్చే ముందు పార్టీ అధినేత చంద్రబాబు పాత క్లస్టర్ ఇన్‌చార్జీలకు ఫోన్ చేసి విషయాన్ని వారికి చెప్పినట్లు తెలిసింది. ఎవరూ నిరాశపడనక్కరలేదని, పార్టీలో మరో చోట వారికి సముచిత స్థానం కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం.

మాతమ్మకు పొంగళ్లు



ఆలయానికి పొంగళ్లతో వస్తున్న మహిళలు

కల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో వెలసిన మాతమ్మ ఆలయంలో అమ్మవారి తిరునాళ్లలో భాగంగా రెండోరోజు సోమవారం మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామం నుంచి పెద్ద ఎత్తున మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకున్నారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మంత్రి భరత్‌ను కలిసిన రామకుప్పం నేతలు



మంత్రి భరత్‌ను కలిసిన రామ్మూర్తి తదితరులు

రామకుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి భరత్‌ను సోమవారం రామకుప్పం మండల ఆర్యవైశ్య సంఘం నేతలు రామ్మూర్తి, సత్యనారాయణశెట్టి, గిరిధర్‌బాబు కర్నూలులో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఆర్య వైశ్య కార్పోరేషన్‌తో విరివిగా సబ్సిడీ రుణాలు అందించి పేద ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకోవాలని మంత్రిని కోరారు.

విద్యాసామగ్రి వితరణ

గుడుపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం కనమనపల్లె శ్రీనివాసస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రిని అందించినట్లు ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ బాలగంగాధర నాయుడు తెలిపారు. పాఠశాలలోని 115 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

దారి సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కొత్తూరు, గుండ్లపల్లి గ్రామస్తులు

గంగవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాలకు రోడ్డులేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మేలుమాయి కొత్తూరు, గుండ్లపల్లి గ్రామస్తులు సోమవారం మేలుమాయి క్రాస్‌లో రోడ్డుపై ధర్నా చేశారు. దశాబ్దాలుగా దారిగా ఉన్న స్థలం తమదే అని మేలుమాయికి చెందిన ఓ రైతు రోడ్డుపై రాళ్లు నాటి అడ్డగిస్తున్నారన్నారు. రోడ్డుపై రాళ్లు నాటేయడంతో దారిలేక మేలుమాయి కొత్తూరు, గుండ్లపల్లి గ్రామాలకు రెండు రోజుల నుంచి కాలి నడకన, ద్విచక్ర వాహనాల్లో మాత్రమే వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని రెవెన్యూ అధికారులను పిలిపించి నాటిన రాళ్లను తొలగించేశారు. దారిని అడ్డగించడానికి ప్రయత్నిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



చౌడేపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వచ్చే వినతులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని.. మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలని తహసీల్దారు పార్వతి సూచించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల దినం సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు సమస్యలను తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'ఇంటింటికీ తెలుగుదేశం' విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తెలియజేస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రజల వద్దకు పాలన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని తెలిపారు. వి.కోట మండలంలోని కొంగాటం పంచాయతీలో ఈనెల 2 నుంచి ప్రారంభించి ఏకకాలంలో అన్ని మండలాల్లో విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ, విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్‌గౌడ, సోమశేఖర్‌గౌడ, ఆనంద, నాగరాజరెడ్డి, కుట్టి, నాయకులు సుబ్రహ్మణ్యంగౌడు, రాంబాబు, గిరి, ప్రతాప్, బ్రహ్మయ్య, ఖాజా, నాగరాజు, చౌడప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే టీడీపీలో గుర్తింపు







హరిప్రసాద్, ధనంజయ నాయుడు, పగడాల రమణలను సన్మానిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డ వారందరికీ గుర్తింపు ఉంటుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్లలోని ఆయన నివాసంలో ఆయన్ను చౌడేపల్లె నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చౌడేపల్లె సింగిల్ విండో చైర్మన్‌గా హరిప్రసాద్, డైరెక్టర్‌గా మునివెంకట రమణలను ప్రతిపాదించడంతో వారిని చల్లా శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, కార్తిక్, గంగాధర్‌రెడ్డి, లాయర్ కుమార్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, శివకుమార్, రామకృష్ణ, సాగర్ నాయుడు, గణేష్, బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్ పాల్గొన్నారు.

● **కల్లూరు:** పులిచెర్లకు చెందిన ధనంజయ నాయుడును సహకార సంఘ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా జయకుమార్, గురప్ప పేర్లను ప్రతిపాదించడంతో సోమవారం మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని రొంపిచెర్లలోని ఆయన నివాసానికి చేరుకొని సత్కరించారు. టీడీపీ నాయకులు వెంకటరమణ, మురళీధర్‌నాయుడు, సుబ్బారెడ్డి, మహేష్, రమేష్, కరుణాకర్‌నాయుడు, చెన్నుపాటి ధన, నూర్‌బాషా, చెంగ్రాయ నాయుడు, రామకృష్ణమ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, భాస్కర్, నజీర్, నాగరాజ నాయుడు, హరికృష్ణ, ఈఎం రత్నం, నాగరాజు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** పుంగనూరు సహకార సంఘంతో రైతులకు మేలు జరిగేలా చూడాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి నూతన చైర్మన్‌గా ప్రతిపాదించిన పగడాల రమణకు సూచించారు.

● **పుంగనూరు రూరల్:** మండలంలోని నేతిగుంట్లపల్లె గ్రామ పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం డైరెక్టర్‌గా ప్రతిపాదనలో ఉన్న కోలాట వెంకటరమణను ఘనంగా సన్మానించారు.

కొనసాగుతున్న ఇంజనీరింగ్ ఉద్యోగుల నిరసన



నిరసనలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు

పలమనేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం పలువురు అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



పుంగనూరులో నిరసన

● **పుంగనూరు:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన సోమవారం నాటికి 17వ రోజుకు చేరింది. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం తమను ఆదుకోవాలని రిలేనిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మైనారిటీ యూత్ నాయకులు ఇర్ఫాన్, బాబు, రిజ్వాన్, కార్మిక సంఘ నాయకులు శ్రీరాములు, కుమార్, గోపి, సంతోష్, శివకుమార్, మోహన్, సోము, వెంకటరమణ, జవహర్‌అలీ, పద్మ భాను, శైలజ పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న యమలా సుదర్శనం

పుంగనూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయంతోనే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి సాధ్యమని జాతీయ మాలమహానాడు కార్యదర్శి యమలా సుదర్శనం పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పట్టణ పరిధిలో అనాధీనంగా ఉన్న భూములను ఎస్సీ, ఎస్టీలకు ఇళ్ల స్థలాలుగా అందివ్వాలని కోరారు. మండల పరిధిలో ప్రభుత్వ ఖాళీ భూములను భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడానికి అధికారులు సహకరించాలన్నారు. ఉపాధి పథకంలో శ్మశానాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాము, మున్సిపల్ డీఈఈ మహేశ్, సీఐ సుబ్బరాయుడు, మాలహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, దళిత నాయకులు రామయ్య, వెంకటరమణ, జ్యోత్స్న, నరసింహులు, శ్రీనివాసులు, చిన్నరాయుడు పాల్గొన్నారు.

మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి శోచనీయం

పుంగనూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడటం శోచనీయమని పుంగనూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ.గిరిశేఖర్, ఉపాధ్యక్షుడు సైపుల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న మంత్రి రవీంద్ర



మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, గనులశాఖల మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా సోమవారం వరసిద్ధుని అభిషేక సేవలో తరించారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు,జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షణ్ముగం, మధుసూదన్‌రావు, నరసింహులు,సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన సుజాత

గంగవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన సంఘటన గంగవరం మండల పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... గంగవరం మండలం నల్లగుట్లపల్లె సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో సంతోషకుమార్, సుజాత దంపతులు కాపురం ఉంటున్నారు. సంతోష్‌కుమార్ కొంతకాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. సుజాత(38)కు సైతం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లాలన్నా నగదు లేక ఇబ్బందులు పడ్డారు. భర్త అనారోగ్యంతో పాటు తన ఆరోగ్యం బాగలేకపోవడంతో సోమవారం మిద్దెపైన ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

మనస్తాపంతో యువతి....

పుంగనూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని సుబేదార్‌వీధికి చెందిన షేక్‌వలిబాషా కుమార్తె హసీనా (19) మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

భూమి గొడవలో ఇద్దరికి గాయాలు

ఐరాల(కాణిపాకం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): భూ సమస్యపై గొడవ జరగడంతో ఇద్దరికి గాయాలు అయ్యినట్లు కాణిపాకం ఏఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు బొమ్మసముద్రానికి చెందిన సాంబశివనాయుడు,పవన్‌కుమార్‌కు కొంత కాలంగా భూ సమస్య ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం సాంబశివనాయుడు జేసీబీతో వివాదం ఉన్న పొలంలో పని చేస్తుండగా పవన్‌కుమార్, అతని తల్లి అడ్డుకున్నారు. దీంతో పవన్‌కుమార్ అతని తల్లిపై దాడి చేసి గాయపరిచినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్టీవో హరిప్రసాద్‌కు సత్కారం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఎం. హరిప్రసాద్ పదవీవిరమణ, సత్కార కార్యక్రమం కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను ఖజానాశాఖ డిప్యూటీ డైరక్టర్ రామచంద్ర శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ట్రెజరీ, అకౌంట్స్ సరీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరేష్‌బాబు, ర్బన్ తహసీల్దార్ కులశేఖర్, ఎస్టీవోలు కె. రెడ్డిభాస్కర్, శివకిరణ్, కార్యాలయ అకౌంటెంట్లు జి. పయణి, చలపతి, తదితరులు హరిప్రసాద్‌ను సత్కరించారు.

'వైసీపీ పాలనలో విద్యారంగం నాశనం'

చిత్తూరు సిటీ, జూన్30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విద్యారంగం నాశనమైందని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు త్యాగరాజన్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గతంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహించారో మాజీ సీఎం జగన్‌కు తెలియదన్నారు. ఈ ఏడాది జూలై మూడో వారంలో ఈసెట్ కౌన్సెలింగ్ పూర్తి చేస్తామని ఇదివరకే విద్యా శాఖమంత్రి నారా లోకేష్ చెప్పాన్నారు. మాజీ సీఎం జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి జయచంద్ర నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గోకుల్, నగర మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నాప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రెండు రోజులు క్రితం వీధిలైట్లు ఆపేది నిరసన తెలిపిన సమయంలో నగర ప్రజలు ఇబ్బంది పడ్డారని గుర్తుచేశారు. సోమవారం నుంచి నీళ్లు నిలిపివేస్తామనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, మణి, విజయగౌరీ, జమీలాభి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల కొరతతో అర్జీదారులకు ఇక్కట్లు

చిత్తూరు రూరల్, జూన్30(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. 26 రెవెన్యూ గ్రామాలకు 9 మంది వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. దీంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్ల కోసం వీఆర్వోల చుట్టు తిరగాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ఊరి సచివాలయంలో ఉంటారో తెలియడంలేదు. కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని, వీఆర్వోలు అందుబాటులో ఉండడం లేదని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రెవెన్యూ గ్రామాలు తిరగడం ఇబ్బందిగా ఉంటోందని వీఆర్వోలు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి వీఆర్వోలను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను త్వరగా పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన సమస్యల అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. సోమవారం తమ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. మండలం నుంచి తమిళనాడుకు ఎట్టి పరిస్థితులలోను గ్రావెల్ ఎర్రమట్టి తరలించకుండా చూడాలన్నారు. అక్రమార్కులు ఎవరైనా అనుమతులు లేకుండా గ్రావెల్,ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ రిషివర్మ, ఆర్ఐ దేవి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బంగారక్క చెరువు ఆధునికీరణకు భూమిపూజ


పూజ నిర్వహిస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బంగారక్కచెరువు రూపురేఖలను మారుస్తామని జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులునాయుడు చెప్పారు. సోమవారం బంగారక్కచెరువులో చెరువు పనులు నిర్వహించడానికి భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును ఆరు అడుగుల లోతు చేసి ఎక్కువ నీరు నిలిచేలా చేస్తామన్నారు. అలాగే చెరువును సుందరీకరిస్తామన్నారు. రైతులు ఈచెరువు నుంచి ఉచితంగా మట్టిని తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పీరా, జీవన్, నాయకులు బాబురెడ్డి,రాజేష్,మధుసూదన్‌రాయల్,బాబు,బాలసుబ్రహ్మణ్యంయాదవ్ పాల్గొన్నారు.

క్యూ పద్ధతి పాటించి సహకరించండి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుడిపాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు సహకరిస్తే త్వరితగతిన కాయలు అన్‌లోడ్ చేయిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం ఆయన ఫ్యాక్టరీ సిబ్బందితో మాట్లాడాక అనంతరం రైతులతో మాట్లాడారు. లోడు ట్రాక్టర్ల క్యూ పద్ధతిలో తీసుకువస్తే అధికారులే రైతు వద్దకు వచ్చి టోకెన్లు ఇచ్చి పంపుతారన్నారు. తాస, ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీల్లో రోజుకు 300లకు పై చిలుకు ట్రాక్టర్లను అనుమతిస్తారన్నారు. రైతులు అధైర్య పడవద్దన్నారు. ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి వద్ద కొందరు ట్రాక్టర్లను రోడ్డుపై నిలపడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. కాగా మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు,ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు తహసీల్దార్‌ను సన్మానించారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం


స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): అగరంపల్లెలోని శ్రీకృష్ణ భజన మందిరానికి సంబంధించిన సర్వే నెంబరు 365,366లలో ఆక్రమిత భూమిని దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు స్థలాన్ని స్వాధీన పరచుకున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ తెలిపారు. సోమవారం ఆక్రమణదారులైన దొరస్వామి, మధు నుంచి స్వాధీన పరచుకున్నట్లు వివరించారు. తహసీల్దార్ లోకేశ్వరి ఆధ్వర్యంలో స్వాధీన పరచుకున్నట్లు ఆమె తెలిపారు. దేవదాయ శాఖ ఆస్తులను ఆక్రమిస్తే శిక్షార్హులని ఆమె స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

నగరి, జూన్30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని సమస్యల పరిష్కారంలో అధికారులకు నిర్లక్ష్యం తగదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. డయ్యింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయన రంగు నీరు డ్రైనేజీలలో ప్రవహిస్తోందని,తాగునీరు శుభ్రంగా రావడంలేదని కొందరు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. .నిబంధనల మేరకు అనుమతులిచ్చినపుడు మురుగనీటి కాలువల్లో రసాయనరంగునీరు ఎలా ప్రవహిస్తోందని వారు అప్రశ్నించారు. త్వరలో ఈసమస్య పరిష్కారిస్తామని అధికారులు తెలిపారు. సమ్మర్‌స్టోరేజీలో ట్యూబర్‌కు మరమ్మతులు చేపడుతున్నామని కమిషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.మున్సిపల్ చైర్మన్ నీలమేఘం,వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్‌లు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రిటైర్డు పారిశుధ్య కార్మికులకు సత్కారం

చిత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవల మరువలేనివని మేయర్ అముద చెప్పారు. ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన నలుగురు పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం సోమవారం నాగయ్య కళాక్షేత్రంగా జరిగింది. మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. గంగరాజు, యశోదమ్మ, సుజాత, విజయమ్మలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, నాగరాజన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

నేడు గుండాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌పురంలో మంగళ, బుధవారాల్లో గుండాలమ్మ జాతర మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మురుగేషన్, రవినాయుడులు తెలిపారు. మంగళవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నటు పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి భక్తులు పొంగళ్ళు పొంగించి అంబలి నైవేద్యం సమర్పిస్తారన్నారు. సాయంత్రం కుంభ నైవేద్యం సమర్పించి, బుధవారం జల ప్రవేశం చేస్తామని తెలియజేశారు.

వరసిద్ధుడ్ని దర్శించుకున్న మంత్రి రవీంద్ర


మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, గనులశాఖల మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా సోమవారం వరసిద్ధుని అభిషేక సేవలో తరించారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు,జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షణ్ముగం, మధుసూదన్‌రావు, నరసింహులు,సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పన్నూరు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శనివారం నగరి బాలమురుగన్‌స్టోర్ యజమాని రాధాకృష్ణా శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య చేతులు మీదుగా పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గ, ఉపాధ్యాయులు భానుమతి, అంగన్‌వాడీ కార్యకర్త, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూమి గొడవలో ఇద్దరికి గాయాలు

ఐరాల(కాణిపాకం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): భూసమస్యపై గొడవ జరగడంతో ఇద్దరికి గాయాలు అయ్యినట్లు కాణిపాకం ఏఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు బొమ్మసముద్రానికి చెందిన సాంబశివనాయుడు,పవన్‌కుమార్‌కు కొంత కాలంగా భూ సమస్య ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం సాంబశినాయుడు జేసీబీతో వివాదం ఉన్న పొలంలో పని చేస్తుండగా పవన్‌కుమార్, అతని తల్లి అడ్డుకున్నారు. దీంతో పవన్‌కుమార్ అతని తల్లిపై దాడి చేసి గాయపరిచినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్టీవో హరిప్రసాద్‌కు సత్కారం


ఎస్టీవో హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న రామచంద్ర

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఎం. హరిప్రసాద్ పదవీవిరమణ, సత్కార కార్యక్రమం కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను ఖజానాశాఖ డిప్యూటీ డైరక్టర్ రామచంద్ర శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ట్రెజరీ, అకౌంట్స్ సరీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరేష్‌బాబు, ర్బన్ తహసీల్దార్ కులశేఖర్, ఎస్టీవోలు కె. రెడ్డిభాస్కర్, శివకిరణ్, కార్యాలయ అకౌంటెంట్లు జి. పయణి, చలపతి, తదితరులు హరిప్రసాద్‌ను సత్కరించారు.

మినీ లారీ బోల్తా



పూతలపట్టు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోళ్ళ వ్యర్థాలతో వెళ్తున్న ఓ మినీ లారీ బోల్తాపడడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సోమవారం చిత్తూరు నుంచి ఓ మినీలారీలో కోళ్ళవ్యర్థాలను తిరుపతికి తీసుకెళ్ళేందుకు రంగంపేట క్రాస్‌లో వెళుతుండగా మినీ లారీ టైరు పంక్చర్ అయింది. దీంతో మినీ లారీ బోల్తాపడింది. డ్రైవర్‌తో పాటు క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు.

హామీలు అమలు చేయకుండా మోసం చేసిన కూటమి : భూమన

చిత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం అమలుచేయని హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సోమవారం కొంగారెడ్డిపల్లెలోని వైసీపీ కార్యాలయంలో నియోకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావే శంలో రీకాల్ చంద్రబాబు మ్యానిపెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీ నేతలు అలవికానీ హామీలను ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక రోజుకో కొత్తఅంశాన్ని తెరపైకి తెస్తూ ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చకుండా గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. నగర పార్టీ అధ్యక్షులు కేపీ శ్రీధర్, మాజీ చైర్‌పర్సన్ సరళామేరి, జయపాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు


సర్విరెడ్డిపల్లె దారిలో విద్యుత్ లైన్ల పనులు

గంగాధరనెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు త్వరలోనే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లభించనుంది. వ్యవసాయానికి ప్రభుత్వం ఉచితంగా రోజుకు 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్న క్రమంలో సరైన లేన్లు లేవు. లోవోల్టేజి సమస్య పరిష్కరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఆర్‌డీఎస్ పథకం ద్వారా కొత్తగా త్రీఫేజ్ లైన్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సబ్‌డివిజన్ పరిధిలో గంగాధరనెల్లూరు మండలంలో కేటగిరి-1 కింద 15,845 ఇండ్ల సర్వీసులు, కేటగిరి-2 కింద 1,214 కమర్షియల్ సర్వీసులు, కేటగిరి-3 కింద 281 ఇండస్ట్రియల్ సర్వీసులు, కేటగిరి-4 కింద 782 వివిధ ప్రభుత్వ కార్యాలయాల, పంచాయతీల వీధిలైట్లు, తాగునీటిబోర్లు సర్వీసులు, కేటగిరి- 5 కింద 4,556 వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. ఆర్డీఎస్ పథకంలో భాగంగా వ్యవసాయ పంపుసెట్లు ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తారు. పొలాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి గ్రామాలను వేరుచేస్తారు. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్ళే ప్రత్యేకలైన్లకు త్రీఫేజ్ ఇస్తారు. పొలాలకు వెళ్ళే లైన్‌కు 9గంటల పాటు మాత్రమే త్రీఫేజ్ ఇచ్చి, తర్వాత నిలిపేస్తారు. గ్రామాల్లో ఉండే రైస్‌మిల్లులు, దీనివల్ల త్రీఫేజ్‌పై ఆధారపడి ఇతరత్రా పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందనుంది.

శరవేగంగా పనులు



గ్రామీణ ప్రాంతాల్లోని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈక్రమంలోనే త్రీఫేజ్ లైన్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం మేరకు పూర్తయినట్లు సమాచారం ఉంది. ఈఏడాది చివరినాటికి పనులు పూర్తి చేసి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయనున్నాం.

- సి. శేషాద్రిరెడ్డి ,విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ఎంపీపీ గోపీనాథ్

గుడిపాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ గోపీనాథ్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుడిపాల ఎంపీటీసీ గోళ్లహరిప్రసాద్‌చౌదరి మాట్లాడుతూ గతంలో స్థలాలు ఇచ్చినా ఇళ్లు నిర్మించని వాటిని రద్దు చేసి అర్హులకు కేటాయించాలన్నారు. సర్పచ్ గుర్రప్పనాయుడు మాట్లాడుతూ వెంటనే మరిన్ని కాయలను తెప్పించాలని కోరారు. సర్పంచ్ జయకోటి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను నిర్వహించడానికి కూలీలకు వెంటనే జాబ్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రీసర్వేలో తప్పులు దొర్లి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో శిరీష మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంఈవో గణపతి, ఏఈలు ప్రసాద్‌రెడ్డి, పవన్, శివకుమార్,ఏపీఎం సుధారాణి, ఎంపీటీసీలు బాలమ్మ, విజయలక్ష్మీ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బకాసురుడి బండి కుంభం


అన్నదానం చేస్తున్న మేళం రవియాదవ్


బండిలో కుంభం తీసుకెళ్తున్న భీముడి వేషదారి

వెదురుకుప్పం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం బకాసురుడి బండి కుంభం కార్యక్రమం జరిగింది. ఈక్రమంలో మధ్యాహ్నం భక్తులకు కార్వేటి నగరానికి చెందిన రమేష్ ఆచారి కుటుంబీకులు అన్నదానం చేశారు. సంప్రదాయబద్ధంగా బకాసురిడికి కుంభాన్ని బండిలో భీముని వేషదారి తీసుకెళ్లారు. విశ్వబ్రాహ్మణ కులస్తుల ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

'వైసీపీ పాలనలో విద్యారంగం నాశనం: టీడీపీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విద్యారంగం నాశనమైందని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు త్యాగరాజన్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గతంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహించారో మాజీ సీఎం జగన్‌కు తెలియదన్నారు. ఈ ఏడాది జూలై మూడో వారంలో ఈసెట్ కౌన్సెలింగ్ పూర్తి చేస్తామని ఇదివరకే విద్యా శాఖమంత్రి నారా లోకేష్ చెప్పాన్నారు. మాజీ సీఎం జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వహక కార్యదర్శి జయచంద్ర నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గోకుల్, నగర మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనంపై నిరసన



గొల్లకండ్రిగలో విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

వెదురుకుప్పం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ బడిని విలీనం చేయవద్దంటూ కార్వేటి నగరం మండలం గొల్లకండ్రిగ, కొటార్వేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విలీనం చేయడం వల్ల పిల్లలు ఆ పాఠశాలకు వెళ్లలేరన్నారు. మూడు కి.మీ దూరంలో ఉన్న కేఎంపురం పాఠశాలకు విలీనం చేయడం తగదన్నారు.

నిష్పాక్షికంగా టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్‌నాయుడు

గంగాధరనెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని మండల టీడీపీ పరిశీలకుడు జయప్రకాష్‌నాయుడు హితవు పలికారు. సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా జయప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ గ్రామ కమిటీల్లో నిష్పక్షపాతంగా ఎంపిక జరగాలన్నారు. సభ్యత్వం లేకుండా ఎంపిక చేస్తే రద్దుచేస్తామన్నారు. సమావేశంలో పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, జ్యోతిరెడ్డి, పాచిగుంట రఘునాధనాయుడు, జనార్దన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో తడి-పొడి చెత్తపై అవగాహన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నింద్ర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ప్రజలకు తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ వర్మ చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి-పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్ అందజేయాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక పనులను రెండుసార్లు నిర్వహించాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశులు, సిబ్బంది అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి రుద్రాభిషేకం

వెదురుకుప్పం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం చేశారు. పూల అలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఎగువ కన్నికాపురం వద్ద మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త అరుణమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మామిడి చెట్ల నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు

పెనుమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మామిడి చెట్లను నరికేయడంతో ఓ రైతు కన్నీరు మున్నీరయ్యాడు. బాధితుడి వివరాల మేరకు గుంటిపల్లి పంచాయతీ రామనాథపురానికి చెందిన చెంగళరాయులు కుమారుడు పద్మనాభానికి 1.75 ఎకరాల మామిడి తోపు ఉంది. కొద్ది నెలలుగా ఈ భూమి తమదని 1బీతో గ్రామానికి చెందిన జయచంద్ర, రూపేష్, బాబు, తులసి, పాపులమ్మలు తనను వేధిస్తున్నారన్నారు. కోర్టులో కూడా కేసు వేశామన్నారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం వెళ్లి చూడగా మామిడి చెట్లను పూర్తిగా నరికేశారన్నాడు. ఇరు వర్గాల వారూ ఫిర్యాదు చేశారని ఎస్ తెలిపారు.

ముగిసిన కొల్లాపురమ్మ తిరునాళ్ల

నింద్ర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కొప్పేడు పంచాయితీ వేదాంపురం ఎస్టీ కాలనీలో కొల్లాపురమ్మ తిరునాళ్ల సోమవారంతో ముగిసింది. ఆదివారం రాత్రి అమ్మవారిని విశేషంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేయాలి

చిత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ వైసీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రారెడ్డి, కార్యదర్శి గోవర్ధన్ నాయుడులు కోరారు. పంచాయతీరాజ్‌వ్యవస్థను నిర్వీర్యంచేస్తున్న కూటమి ప్రభుత్వతీరును నిరసిస్తూ, కేంద్రం విడుదల చేసిన నిధులను పక్కదారిపట్టించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వోకు వినతిపత్రాన్ని ఇచ్చారు.

కుప్పం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా తులసీనాథ్

కుప్పం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. నియోజకవర్గానికి సంబంధించి బీజేపీ సంస్థాగత వ్యవహారాలు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను తులసీనాథ్ చూస్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు సైతం ఇకపై జరిగే కార్యక్రమాలకు తులసీనాథ్‌ను ఆహ్వానించాలని జిల్లా అధ్యక్షుడు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.